


మునగనూరు బ్యాంకు కాలనీ, హయత్‌నగర్ సరిహద్దు రోడ్డులో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

ఈ కంపు పట్టించుకోరా!

- మునగనూరు- హయత్‌నగర్ సరిహద్దును కలిపే చోట పేరుకుపోయిన చెత్త
- ఇబ్బంది పడుతున్న స్థానికులు పట్టించుకోని అధికారులు

హయత్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అది తుర్కయంజాల్ మున్సిపాలిటీ.. మునగనూరును- హయత్‌నగర్ డివిజన్‌ను కలిపే బ్యాంకు కాలనీ రోడ్డు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో ప్రజలు అటువైపు రావడమే మానేశారు. అందులోనే పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. ఇక్కడ 15 రోజులుగా చెత్త పేరుకుపోయింది. అటు తుర్కయంజాల్ మున్సిపాలిటీ శానిటేషన్ అధికారులు, ఇటు హయత్‌నగర్ డివిజన్ శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మునగనూరు బ్యాంకు కాలనీ, బంజారాకాలనీతో పాటు దాదాపు 20 కాలనీల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కుళ్లి కంపుకొడుతున్న చెత్తను, వ్యర్థాలను అక్కడ్నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం





పచ్చదనంతో విరాజిల్లుతున్న నల్లగొండ క్రాస్‌రోడ్‌లోని జాతీయ వికలాంగుల పార్కు

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నల్లగొండ క్రాస్‌రోడ్‌లో ఉన్న వికలాంగుల జాతీయ పార్కు ఆహ్లాదకరంగా మారింది. పార్కులోని పచ్చని మొక్కలు.. పచ్చిక బయళ్లు చూపరులను పార్కుకు వచ్చిన వారిని ఆకట్టుకుంటున్నాయి. మెట్రోమార్గం, రైలు మార్గం, జాతీయ రహదారి, సైదాబాద్ ఫ్లైఓవర్ నాలుగు మార్గాలు కలిసే చోటు ఎంతో రద్దీ ఉండే నల్లగొండ క్రాస్‌రోడ్‌లో ఉన్న వికలాంగుల జాతీయ పార్కు ఎంతో ఆకర్శణీయంగా కనబడుతుంది. ప్రతిరోజు ఉదయం సాయంత్రం చుట్టు పక్క కాలనీల ప్రజలు పార్కులో పచ్చని మొక్కల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో వాకింగ్ చేస్తూ సేదతీరుతున్నారు. పార్కులో చిన్నపాటి మినీ ఓపెన్ స్టేడియంతో పాటు వికలాంగుల ఫిజియోతెరపీ క్లినిక్ ఉంది.

సైబరాబాద్ ఇన్‌స్పెక్టర్‌కు కేంద్ర గృహమంత్రి పతకం



సీఐ ఉపేందర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జె.ఉపేందర్ కేంద్రీయ గృహమంత్రి దక్షతాపతకానికి ఎంపికయ్యారు. దేశ మొదటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం.. ప్రతిభ చూపిన అధికారులకు పతకాలు అందిస్తుంది. పలు కేసుల దర్యాప్తులో ప్రతిభచూపి 9 కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడేలా చేసినందుకు గాను కేంద్రం ఈ అవార్డుతో ఆయనను సత్కరించింది.



సంపూర్ణ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథం

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని పలు హోటల్స్‌లో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం తనిఖీ నిర్వహించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథం సమక్షంలో ఔటర్ రింగురోడ్డు జంక్షన్‌లోని సంపూర్ణహోటల్, క్రౌన్ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వంటకాల్లో వినియోగిస్తున్న వస్తువులను తనిఖీ చేసి కిచెన్‌లోని శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు కమిషనర్ తెలిపారు. వంటగదితో పాటు హాల్‌లో పరిశుభ్రత పాటించాలని, ఆహార పదార్థాలపై మూతలను పెట్టాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారబోయకుండా మున్సిపాలిటీ చెత్త రిక్షాలో వేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చట్ట పరమైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మైనారిటీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే

హయత్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలకు అన్ని విధాలా అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. శనివారం ఇందిరమ్మ మైనారిటీ మహిళా శక్తి, రేవంతన్న భరోసా పథకంలో భాగంగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెండో విడత నిరుపేద మైనారిటీ మహిళలకు తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లో కుట్టు మిషన్ల పంపిణీ చేట్టారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన 200 మంది మైనారిటీ మహిళలకు ఎమ్మెల్యే రంగారెడ్డి కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. విడతల వారీగా పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేదలను దృష్టిలో పెట్టుకుని ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి

ప్రధాన రోడ్లను అభివృద్ధి చేస్తాం : కార్పొరేటర్ కళ్లెం

హయత్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎక్కువగా ఉపయోగించే ప్రధానమైన రోడ్లను త్వరితగతిన అభివృద్ధి చేస్తున్నట్లు హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని ముదిరాజకాలనీలో సీసీ రోడ్డు పనులను కాలనీ ప్రజలతో కలిసి ఆయన ప్రారంభించారు. భూగర్భ డ్రైనేజీ పూర్తయిన చోట రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ముదిరాజ్ కాలనీలో కొన్ని ప్రాంతాలలో భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ముదిరాజ్ కాలనీ నుంచి ఇన్ఫర్మేషన్ కాలనీ రోడ్డును కలుపుతూ రోడ్డు నిర్మించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్, మధు ముదిరాజ్, దాసరమోని శ్రీనివాస్, సాయిప్రకాష్, రాము, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్తీక మాసం పురస్కరించుకొని నాగోల్ డివిజన్ శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయంలో రామ సహిత సత్యనారాయణ స్వామి వ్రత పూజలో ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ దంపతులు

- మన్సూరాబాద్, ఆంధ్రజ్యోతి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బాచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి, పక్కన ఏఎంసీ చైర్మన్ మదుసూధన్‌రెడ్డి తదితరులు



కోహెడలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం, గౌరెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించగా, బండరావిరాలలో హయత్‌నగర్ సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం కుత్బుల్లాపూర్ గ్రామంలో రెండు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. గ్రేడ్-1 ధాన్యానికి రూ. 2,389, సాధారణ ధాన్యానికి రూ. 2,369 ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మదుసూధన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత, అబ్దుల్లాపూర్‌మెట్ మండల వ్యవసాయ అధికారి పల్లవి, ఏఈవో రఘు పాల్గొన్నారు.

కోహెడలో..

హయత్‌నగర్, (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కోహెడలో శనివారం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి, కృష్ణారెడ్డి, సత్యానారాయణరెడ్డి, కొండ్రు స్వప్న, ఎలిమిటి నరసింహారెడ్డి, కందాళ బల్‌దేవరెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.4 కోట్లు ఇవ్వండి

అధికారులతో కార్పొరేటర్ కొప్పుల



హయత్‌నగర్‌లో ధ్వంసమైన రోడ్డును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

హయత్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలో ధ్వంసమైన రోడ్లను బాగు చేసేందుకు రూ. 4 కోట్లు మంజూరు చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్‌ను కోరారు. జోనల్ కమిషనర్ ఆదేశం మేరకు శనివారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఈఈ రమేష్‌బాబు, డీఈఈ కనకయ్య, డబ్ల్యూఐ సీతారాం కార్పొరేటర్ నరసింహారెడ్డితో కలిసి వినాయకనగర్ నుంచి బొమ్మలగుడి మీదుగా ఉన్న ధ్వంసమైన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు వినాయకనగర్ నుంచి డబల్ బెడ్ వరకు ఉన్న రోడ్డు రోడ్డు గుంతల మయంగా మారిందని అధికారులకు వివరించారు. రోడ్డు మరమ్మతుల కోసం దాదాపు రూ.4కోట్లు ఖర్చవుతుందని, ఈ రోడ్డును దాదాపు 40 కాలనీ ప్రజలు వాడుకుంటారని తెలిపారు. నిత్యం రోడ్లపైన ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రి వేళల్లో వాహన దారులు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారని అధికారులకు వివరించారు. తట్టిఅన్నారం, నాగోల్ నుంచి వచ్చే వారు కూడా ఈ రోడ్డును ఉపయోగిస్తారని తెలిపారు. గుంతల రోడ్డును బాగు చేసి రోడ్డును విస్తరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో అధికారులతో పాటు పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వరదనీటి నాలా పనుల్లో నాణ్యత పాటించాలి: కార్పొరేటర్



నాలా పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్‌యాదవ్

మన్సూరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వరదనీటి నాలా పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని గోల్డెన్‌లీఫ్స్ విల్లాస్‌లో రూ.58లక్షలతో చేపట్టదలచిన వరదనీటి నాలా పనులను శనివారం ఆమె ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఇక్కడ వరదనీటి సమస్య తలెత్తుతుండడంతో శాశ్వత పరిష్కారానికి పనులను ప్రారంభించామన్నారు. అదేవిధంగా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, విద్యుత్ సమస్య తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలా పనులకు చొరవ చూపడం పట్ల కార్పొరేటర్ దంపతులను కాలనీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సీతారాంరెడ్డి, ట్రెజరర్ దీపక్‌నాయుడు, సభ్యులు శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రావు, శ్రీకాంత్‌రావు తదితరులు ఉన్నారు.

స్పెషల్ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ ఉత్తమమార్గమని రంగారెడ్డి జిల్లా కోర్టుల సూపరింటెండెంట్ సునీత అన్నారు. శనివారం జిల్లా కోర్టులలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లా ప్రధా న న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఈ నెల 15న జిల్లా కోర్టులలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు, పిటీషనర్లు దీనిని సద్వినియోగపర్చుకుని కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలని సూచించారు. ఈ లోక్‌అదాలత్‌లో కుటుంబ తగాదాలు, చెక్కు బౌన్స్ కేసులు, భూముల కేసులు, మోటారు వాహనాల కేసులు వంటివి పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. స్పెషల్ లోక్‌అదాలత్‌కు న్యాయవాదులు సహకరించాలని కోరారు.

గంజాయి విక్రేత అరెస్ట్



నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

పేట్‌బషీరాబాద్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని మేడ్చల్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, అతడి వద్ద 850 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెంది న బిట్టు బారిక్ (25) జీవనోపాధి కోసం రెండేళ్ల క్రితం మేడ్చల్‌కు వలస వచ్చాడు. కండ్లకోయలోని మల్లన్న కాలనీలో తన సోదరులతో కలిసి ఉంటున్న బిట్టు కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. శనివారం కండ్లకోయలో బారిక్ గంజాయి అమ్ముతు న్నట్టు సమాచారం అందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీ సులు దాడి చేసి అతడి వద్ద నుంచి 850 గ్రాముల గంజాయిని, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఎస్ఐ పవన్ కుమార్‌రెడ్డి, సిబ్బంది సత్తార్ ఉన్నారు.



సైదాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

సైదాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం

సైదాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సింధూర్ యుద్ధాన్ని అగౌరవపరుస్తూ సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహిస్తూ బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్ బాబు ఆధ్వర్యంలో పార్టీ నేతలు శనివారం సైదాబాద్ ప్రధాప రహదారిపై సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సీఎం దేశ సైనికుల పట్ల అమర్యాద వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

'న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ వర్తింపజేయాలి'

చాదర్‌ఘాట్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదులందరికి తెలంగాణ అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్‌ను వర్తింపజేయాలని కోరుతూ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ సీఎం, బార్ కౌన్సిల్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రాలను పంపించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ కోర్టుల్లో 40వేల మంది న్యాయవాదులు సేవలు అందిస్తున్నారన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధిలో సభ్యత్వం లేని వారికి ఒక్క అవకాశం పేరిట రెండు రోజుల క్రితం బార్ కౌన్సిల్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. సభ్యత్వం పొందడానికి పలు షరతులు విధించడం అన్యాయమని ఆయన అన్నారు. సమావేశంలో న్యాయవాదులు లలిత, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఆది వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

హయత్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ ఏపీ నగర్‌లోని భూనీళా సమేత ఆది వేంకటేశ్వరస్వామి ఆలయ 26వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ట్రస్టీ నోముల అశోక్‌కుమార్‌గౌడ్ తెలిపారు. 8న సాయంత్రం 6.30 గంటలకు వైభవంగా అలంకరించిన కల్యాణ మండపంలో ఆది వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా 2 నుంచి 5వ తేదీ వరకు కార్తీక శుద్ధ పౌర్ణమి పవిత్రోత్సవాలు ఉంటాయని తెలిపారు.



మధుయాష్కీగౌడ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ఈవో లావణ్య, ధర్మకర్తలు

కార్తీక మహోత్సవానికి రండి

చంపాపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో అత్యంత వైభవంగా ఈ నెల 5న నిర్వహించనున్న కార్తీక పౌర్ణమి మహోత్సవానికి విచ్చేయాలని కోరుతూ ఆలయ ఈవో లావణ్య, ఆలయ ధర్మకర్తలు శనివారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మధుయాష్కీగౌడ్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మధుయాష్కీగౌడ్‌కు వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తోకటి కిరణ్‌కుమార్, సింగంశెట్టి శ్రీనివాస్, ఓరుగంటి నరేష్, కె.కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలి : కొప్పుల

మన్సూరాబాద్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా శనివారం డివిజన్ పరిధిలోని చిత్రసీమకాలనీలో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. అక్కడ తలెత్తిన విద్యుత్ సమస్యలను తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ, కాలనీలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శంకర్, ఎల్ఐ రాజయ్యచారి, చిత్రసీమ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జి.హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'సీఐటీయూ మహాసభను విజయవంతం చేయండి'

వనస్థలిపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 10,11 తేదీల్లో కాటేదాన్‌లో నిర్వహించే సీఐటీయూ రంగారెడ్డి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు వనస్థలిపురంలో శనివారం మహాసభల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కార్మిక చట్టాలను మార్చుతూ వారి హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వాటి సాధనకు సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. 10న జరిగే బహిరంగ సభతో పాటు 11న జరిగే ప్రతినిధుల సభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



ఇందిరా పార్కుకు తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

దళితుల ఆత్మగౌరవ సభకు ఎమ్మార్పీఎస్ నేతలు

కొత్తపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ అని కొత్తపేట ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్‌మాదిగ అన్నారు. ఈ దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఇందిరా పార్కు వద్ద శనివారం చేపట్టిన దళితుల ఆత్మగౌరవ సభకు రాజశేఖర్‌మాదిగ ఆధ్వర్యంలో కొత్తపేట ఎమ్మార్పీఎస్ నాయకులు బయల్దేరారు. ఇందులో కొత్తపేట ఎమ్మార్పీఎస్ నాయకులు మొండికొత్తి పరశురాం, మీసాల నాగరాజు, ఇరువు నాగరాజు, ధర్మారం అశోక్, నరసింహ, సతీష్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.